క్లుప్తంగా

సీతారామస్వామికి విశేష పూజలు



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీసీతారామస్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం అభిషేకాలు, శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ కొండ గంగరాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి సు. దీరాచార్యులు జన్మ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారికి స్నపన, శాంతి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారిని విశేషంగా అలకరించించి ముస్తాబు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో యోగాంధ్ర



ట్రైనీలకు శిక్షణ ఇస్తున్న యోగా మాస్టర్లు

పెదవేగి : యోగాంధ్ర కార్యక్రమంలో గ్రామ స్థాయి యోగా ట్రైనీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో 70 మంది ట్రైనీలు పాల్గొన్నార న్నారు. వీరికి ఆయుష్ శాఖ యోగా మాస్టర్ ట్రైనర్ కె.నోద్‌కుమార్, రాయన్నపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు రఫీ, కొప్పాక హైస్కూల్‌కు చెందిన శ్రీనివాస్‌లు శిక్షణ అందించారన్నారు.

చెట్లు నరికి వేయడం దారుణం

గణపవరం: మురుగు, పంట కాలువల తవ్వకం పేరుతో గట్ల వెంబడి ఉన్న వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం దారుణమని ప్రముఖ వృక్ష ప్రేమికుడు రంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తాను రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ చేసిన నాటి నుంచి గణపవరంలో ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన, పుంత గట్లపై ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనూ వందల సంఖ్యలో మొక్కలు నాటి వాటిని పెంచి పోషిస్తున్నానని, ఇప్పటి వరకూ అనేక మొక్కలు వృక్షాలుగా ఎదిగాయని తెలిపారు. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ వెంబడి, మురుగు కాలువ గట్టుపై దాదాపు 150 మొక్కలు నాటి వాటిని పదేళ్లుగా పోషిస్తూ వస్తున్నానని, అవన్నీ ఇప్పుడు వృక్షాలుగా ఎదిగాయన్నారు. ఇటీవల బోదె తవ్వకం పేరుతో జేసీబీతో ఈ చెట్లను పూర్తిగా తొలగించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఏఎస్‌ఓ సేవలు అభినందనీయం



మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌ఓను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

పెదపాడు: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌ఓగా సీహెచ్ ఆదినారాయణ అందించిన సేవలు అభినందనీయమని పలువురు అధికారులు కొనియాడారు. పెదపాడు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆదినారాయణ పదవీ విరమణ సభ నిర్వహించారు. తహసీల్దార్ ఎ.కృష్ణ జ్యోతి, పెదపాడు ఎంపీడీవో అమీలుజమా ఆదినారాయణ దంపతులను సత్కరించారు. వీఆర్వోల సంఘం నాయకులు ఆర్ఎఎస్ చంద్రమూర్తి, బెవర కోటేశ్వరరావు, సాయిల వెంకటేశ్వరరావు, నర్సింహారావు, గంట ప్రభాకరరావు, కె. నటరాజన్ దాస్, వెంకటేశ్వరరావు, మురళీ పాల్గొన్నారు.

క్షేత్రానికి పోటెత్తిన కాలి నడక భక్తులు

ద్వారకాతిరుమల: ఓ పక్క చిమ్మ చీకటి.. మరో పక్క వర్షం. అయినా వాటిని లెక్క చేయకుండా శ్రీవారి క్షేత్రానికి పాదయాత్ర భక్తులు శుక్రవారం రాత్రి పోటెత్తారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, గణపవరం ప్రాంతాలకు చెందిన భక్తులు దూబచర్ల–అయ్యవరం మీదుగా కొండపైకి చేరుకున్నారు. అలాగే ఉయ్యూరు, గుడివాడ, ఏలూరు పరిస ర ప్రాంతాలకు చెందిన భక్తులు భీమడోలు, అదే విధంగా ఆడమిల్లి–వెంకటకృష్ణాపురం నుంచి స్థానిక నృసింహ సాగరం మీదుగా క్షేత్రానికి చేరుకున్నారు. కాలి నడక మార్గాల్లో వీధి లైట్లు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సెల్‌ఫోన్ లైట్ల వెలుగుల్లో క్షేత్రానికి చేరుకున్నారు. పాదయాత్ర భక్తులకు దేవస్థా నం సిబ్బంది ఉచిత అన్న ప్రసాదాన్ని, ఉచిత దర్శనం టికెట్లను అందజేశారు. శనివారం ఉదయం వీరు స్వామి, అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

వలంటీర్ వ్యవస్థపై కూటమి కత్తి

- నమ్మించి మోసం చేసాడంటున్న వలంటీర్లు.. పల్లె పాలన అస్తవ్యస్తం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లతో మెరుగైన సేవలు
- నియోజకవర్గంలో 1478 మంది వలంటీర్లతో సేవలు



మనం-మన పరిశుభ్రతపై ర్యాలీ చేస్తున్న వలంటీర్లు (ఫైల్)



నారాయణపురంలో వలంటీరును సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ రమావతి (ఫైల్)



కరోనా సమయంలో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ఉంగుటూరు: గాంధీ కన్న కలలు నిజం చేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్ వ్యవస్థను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. గుమ్మం ముందుకే పాలన వచ్చిందన్న చందంగా వలంటీర్లు గుమ్మం తట్టి అన్ని రకాల ప్రభుత్వ పథకాలను అందేలా చేసేవారు. వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి ఎక్కడ రూపాయి పొల్లు పోకుండా నేరుగా లబ్ధిదారుడి ఖాతాలో సంక్షేమ పథకాల నగదు పడేలా వైఎస్ జగన్ ప్రభుత్వం చేసింది. గత ఎన్నికల్లో వలంటీర్లకు మాయ మాటలు చెప్పి చంద్రబాబు మోసం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గాని మోసం చేశారన్న విషయం వలంటీర్లకు తెలిసి రాలేదు. నెలకు పది వేలు చేస్తానని, లలంటీరు వ్యవస్థను పటిష్ట పరుస్తానని చంద్రబాబు ఎన్నికల హామీలో చెప్పారు. కొంతమంది లలంటీర్లు అటుగా ఒరిగారు. ఇపుడు వలంటీరు వ్యవస్థ పేరు ఎత్తకుండా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. దీనిపై ప్రజలు, వలంటీర్లు పెదవి విరుస్తున్నారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో వలంటీర్లు అందించిన సేవలు

రైస్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, జగనన్న విద్యా దీవెన, పింఛన్ కార్డులు, అమ్మఒడి ఫించన్ కార్డు, అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా–సున్నా వడ్డీ, కాపు నేస్తం, రజక, నాయీబ్రాహ్మణ, టైలర్లు, పాస్టర్లు, అర్చకులకు పలు పథకాలు, వైఎస్సార్ వాహన మిత్ర, వైఎస్సార్ బీమా, పేదలందరికీ ఇళ్లు వంటి పలు పథకాలకు అర్హులను గుర్తించి ఇంటింటికీ సంక్షేమ ఫలాలు చేర వేసేవారు. ఈ వ్యవస్థ అప్పటిలో దేశంలో ఎక్కడా లేని విధంగా నిర్వహించారు. 50 కుటుంబాలకు ఒక వలంటీరు చొప్పున కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచారు. వలంటీర్లకు గౌరవ వేతనం రూ.5 వేలు ప్రతి నెలా అందించే వారు. ఆ గౌరవ వేతనంతో అదే గ్రామంలో నివసిస్తూ పేద బడుగు, బలహీన వర్గాల నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి పొందేవారు. పలు శాఖల సమన్వయంతో వలంటీర్లు పని చేసేవారు. వలంటీర్లను ప్రోత్సహించేందుకు వారి సేవలకు గుర్తింపుగా సేవా వజ్ర, సేవా రత్న, సేవామిత్రా అవార్డులతో ప్రభుత్వం సత్కరించింది. ఇపుడు ప్రజలకు ఆ సేవలు అందడం లేదు. వలంటీర్లు ఉపాధి కోల్పోయారు.

నమ్మి మోసపోయాం



చంద్రబాబు నాయుడు హామీలను నమ్మి మోసపోయాం. గ్రామంలో ఉండి వలంటీరుగా చిత్తశుద్ధితో పని చేసి ప్రజలకు సేవ చేస్తున్నామనే తృప్తి ఉండేది. గౌరవ వేతనం రూ.5 వేలు కుటుంబం వెళ్లదీయడానికి ఉపయోగపడేది. వలంటీరు తీసేశాక ఆర్థికంగా నానా ఇబ్బందులు పడుతున్నాను. ఇద్దరు పిల్లలతో డ్వాక్రా కట్టుకోవడం, కుటుంబం వెళ్లదీయడానికి నానా అవస్థలు పడుతున్నాం. కోవిడ్ సమయంలో కూడా లెక్క చేయకుండా సేవలు అందించాం.

– జుత్తిక కొండలరావు, వలంటీరు, నారాయణపురం.

ప్రజలకు ఎంతో అండగా ఉండేవారం



ప్రజలకు ఎంతో అండగా ఉండేవారం. సంక్షేమ పథకాలు తలుపుతట్టి అందించే వారం. మమ్మల్ని చూసి ఎంతో ఆనంద పడేవారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పని చేశాం. గౌరవ వేతనం ద్వారా వచ్చే డబ్బులు మాకు ఎంతో ఉపయోగపడేవి. కటుంబంలో ఖర్చులకు, ఇతర సాయానికి ఉపయోగంగా ఉండేది. మేము చేసే ఇతర పనికి తోడుగా వలంటీరు సొమ్ము ఉపయోగపడేది.

– కొండూరి మనోజ్, వలంటీరు, ఉంగుటూరు

నూతన హెచ్ఎంలు వీరే

దెందులూరు: బదిలీల్లో భాగంగా దెందులూరు మండలంలో నాలుగు ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు బదిలీపై వచ్చారని దెందులూరు మండల విద్యాశాఖ అధికారి ఇన్‌చార్జి ఎస్ఎన్ మూర్తి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలకు రాచూరు నుంచి వడ్లపట్ల విజయకుమార్ హెచ్ఎంగా నియమితులయ్యారు. మేధినరావుపాలెం ఉన్నత పాఠశాలకు పి.సురేష్, పంగిడిగూడెం ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వచ్చి నియమితులయ్యారు. పోతునూరు ఉన్నత పాఠశాలకు ఎ.జయశంకర్ ప్రకాష్, గోపన్నపాలెం ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వచ్చి నియమితులయ్యారు. చల్ల చింతలపూడి ఉన్నత పాఠశాలకు వీవీఎస్ మల్లేశ్వరి వీరంపాలెం ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వచ్చి నియమితులయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి: మండలంలోని విజయరాయి సెక్షన్ పలు సబ్ స్టేషన్ల పరిధిలో ఈ నెల 31వ తేదీ శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ తెలిపారు. విజయరాయి సబ్‌స్టేషన్ పరిధిలో విజయరాయి, గాంధీ నగర్, జంగళవారిపేట ముత్తనవేడు గ్రామాలకు, రాయుడుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని రాట్నాలగుంట, రాయుడుపాలెం, కొండలరావులపాలెం, లేల్లగూడెం గ్రామాలకు, విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. బాపిరాజుగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని బాపిరాజుగూడెం, రామచంద్రాపురం, నడిపల్లి, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలను పెంచాలి



వైద్యులతో సమీక్షిస్తున్న జిల్లా వైద్యాధికారిణి

గణపవరం: పీహెచ్‌సీల్లో ప్రతి నెలా సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని, ఏ ఒక్క గర్భిణీ ఇంటి వద్ద ప్రసవం చేసే పరిస్థితి ఉండకూడదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి గీతాబాయి అన్నారు. శుక్రవారం ఆమె గణపవరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రి వార్డులను, ఫార్మసీ, ల్యాబ్, ప్రత్యేక వార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను పీహెచ్‌సీలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో సదుపాయాలు, ఇంకా కావలసిన అవసరాలను గురించి వైద్యాధికారిణి కిరణ్మయిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, రోగులకు తగిన పరీక్షలు చేసి, మందులు ఇవ్వాలన్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు కనీసం రోజుకు 40 వరకూ ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, కొద్ది రోజుల పాటు పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఓఆర్ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోజువారీ పేషెంట్ల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, హెచ్‌వీ పద్మజ, శిరోమణి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు కీటక నియంత్రణ చర్యలు



ఎస్సీ హాస్టల్‌లో రసాయనాలు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా అన్ని విద్యా సంస్థలు, వసతి గృహాల్లో ముందస్తు కీటక నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తాడేపల్లిగూడెం సబ్ డివిజనల్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో గణపవరం ఎస్సీ, బీసీ బాలురు, బాలికల వసతి గృహాల్లో ముందస్తు కీటక నియంత్రణ చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వసతిగృహం పరిసరాలు, గదులు, టాయిలెట్స్, కిచెన్, డైనింగ్ హాలు తదితర ప్రాంతాలను శుభ్రంచేసి, కీటక నియంత్రణ రసాయనాలను పిచికారీ చేశారు. వైద్యాధికారిణి కిరణ్మయి, సీహెచ్‌వో జాలాది విల్సన్ పాల్గొన్నారు.

కార్మిక వర్గ ఐక్యతతోనే హక్కుల సాధన



భీమడోలు: పాతూరులో జెండాను ఎగుర వేస్తున్న హమాలీ కార్మిక సంఘం నాయకులు



పెదవేగి: లక్ష్మీపురం మార్కెట్ యార్డ్ వద్ద నినాదాలు చేస్తున్న సీఐటీయూ నేతలు

భీమడోలు: కార్మిక వర్గ ఐక్యత ద్వారానే కార్మిక రాజ్య స్థాపన సాధ్యమని సీఐటీయూ మండల నాయకులు దుర్గారావు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు సివిల్ సప్‌లై గోడౌన్ వద్ద శుక్రవారం సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో హమాలీలు పాల్గొన్నారు.

సీఐటీయయూ పోరాటాలకు 55 ఏళ్లు

పెదవేగి : సీఐటీయూ ఐక్యత, పోరాటం నినాదంతో గత 55 సంవత్సరాలుగా కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌డీ ప్రసాద్ అన్నారు. సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దెందులూరు మార్కెట్ యార్డ్ వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.ప్రసాద్, మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్బారావు దుర్గారావు రమేష్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

ఏఎస్ఆర్ నగర్‌లో సౌకర్యాలు కల్పించాలి

టి.నరసాపురం: స్థానిక పంచాయతీ పరిధిలోని అల్లూరి సీతారామరాజు నగర్‌కు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు, ఏఎస్ఆర్‌నగర్ వాసులు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి, కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ ఏఎస్ఆర్ నగర్ ఏర్పడి 17 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి



కూచింపూడిలో కిశోర బాలికలతో మాట్లాడుతున్న అదనపు సీడీపీఓ సునీల్ రాజశేఖర్

పెదవేగి : కిశోర బాలికలు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని పెదపాడు ప్రాజెక్ట్ అదనపు సీడీపీఓ ఎం సునీల్ రాజశేఖర్ అన్నారు. పెదవేగి మండలం కూచింపూడిలో మే 2 నుంచి గ్రామ సచివాలయంలో కిశోరి వికాసం కార్యక్రమాలను గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న కిశోర బాలికలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మే 2 నుంచి జూన్ 6 వరకు కిశోర బాలికలకు సమ్మర్ క్యాంప్స్ కింద కార్యక్రమాలను ప్రతి మంగళ, శుక్రవారాల్లో వారికి ఆరు సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఎస్.ఎలిజబెత్ రాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు మెరుగైన సేవలు అందించాలి



చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్సైలతో బదిలీ అయిన పోలీసులు

ఉంగుటూరు: పోలీసు ఉద్యోగం చేసేవారు మెరుగైన సేవలు అందించాలని నిడమర్రు సీఐ సుబాష్ అన్నారు. చేబ్రోలు, నిడమర్రు పోలీస్టేషన్ నుంచి వేరే ప్రాంతాలకు బదిలీ అయిన 17 మందికి అభినందన సత్కార సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గణపవరం ఎస్సై మణికుమార్, చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్, నిడమర్రు ఎస్సై వీరప్రసాద్ పాల్గొన్నారు.

బడుగు విద్యార్థుల భవిత ప్రశ్నార్థకం



నాడు - నేడు నిధులతో సర్వాంగ సుందరంగా తయారైన శనివారపుపేట హైస్కూల్



నాడు-నేడు నిధులతో విద్యార్థులకు సమకూర్చిన బెంచీలు

- తల్లికి వందనం ఎప్పుడో?
- పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దిక్కులేదు
- నిలిచిన నాడు – నేడు పనులు



నిధులు నిలిపివేయడంతో మధ్యలోనే నిలిచిన శ్రీ కృష్ణదేవరాయ పాఠశాల తరగతి గదుల నిర్మాణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గంలో బడుగు విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన విద్యా సంస్కరణలతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు గత ఐదేళ్లలో ఉన్నత చదువులు చదివి మంచి మంచి స్థానాల్లో, మంచి స్థాయిల్లో స్థిరపడ్డారు. ఉన్నత చదువులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయనక్కరలేకుండా మొత్తం ప్రభుత్వం నుంచే నిధులు విడుదల చేసి పేదల చదువులు నిరాటంకంగా కొనసాగడానికి బంగారు మార్గాన్ని పరిచారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆయా విద్యారంగ పథకాలతో విద్యార్థులు అంచెలంచెలుగా ఎదిగి మరికొందరికి మార్గదర్శకంగా నిలిచారు. ఈ క్రమంలో ఆర్థిక భారం కారణంగా చదువు మధ్యలో మానేసిన అనేక మంది సైతం ఆయా పథకాల ప్రోత్సాహంతో తిరిగి అభ్యాసం ప్రారంభించి, దిగ్విజయంగా పూర్తి చేసిన వారున్నారు. ఆయా పథకాలు వర్తిస్తాయని చదువు కొనసాగిస్తున్న బడుగు, బలహీన వర్గాల పిల్లల భవిత నేటి కూటమి విధానాలు, వైఫల్యాలతో అటకెక్కే ప్రమాదంలో పడింది. కేవలం సంక్షేమ పథకాల ఆసరాతోనే చదువును కొనసాగించే పేద విద్యార్థులకు గత ఏడాది ప్రతి రోజూ కాళరాత్రిగా మారింది. ఫీజుల డబ్బులు పడతాయని ఎదురు చూడడం, కళాశాలల యాజమాన్యాల నుంచి బెదిరింపులు ఎదుర్కోవడం వంటి అనేక కష్టాలతో పేద విద్యార్థులు విద్య అస్తవ్యస్తంగా మారింది.

నాడు నిరాటంకంగా అమ్మ ఒడి

గత ప్రభుత్వంలో అమఒడి పథకం నిరాటంకంగా ప్రతి ఏటా అమలు చేశారు. ఏలూరు నియోజకవర్గంలో 18,835 మంది విద్యార్థుల తల్లులకు ఏటా రూ.28.25 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. 2024 – 2025 విద్యా సంవత్సరంలో మాత్రం తల్లులకు నిరాశే ఎదురైంది. అప్పట్లో ఇంటికి ఒక విద్యార్థి చొప్పున అమ్మ ఒడి పథకాన్ని అమలు చేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిన మేరకు ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులు తమకు ఏడాదికి కనీసం రూ.30 వేలు వస్తుందని ఆశించారు. ఈ లెక్కన ఏలూరు నియోజకవర్గంలో గత విద్యా సంవత్సరంలో మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల్లో 47,824 మంది విద్యాభ్యాసం చేశారు. దీని ప్రకారం ప్రభుత్వం ఆయా విద్యార్థుల తల్లులకు రూ.71.73 కోట్లు జమ చెల్లించాల్సి ఉంది.

ఫీజుల కోసం అప్పులపాలు

గత ప్రభుత్వంలో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను అమలు చేశారు. ఒక్క ఏలూరు నియోజకవర్గంలోనే ఉన్నత విద్యకు సంబంధించి సీఆర్ఆర్ అటానమస్, సీఆర్ఆర్ పీజీ, సీఆర్ఆర్ ఇంజినీరింగ్, తదితర కళాశాలలతో పాటు రామచంద్ర ఇంజినీరింగ్, ఏలూరు ఇంజినీరింగ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆదిత్య, ఎస్ఆర్ఐ డిగ్రీ కళాశాలల తదితర కళాశాలల్లో సుమారు 8 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ఆయా చదువు, కళాశాలల స్థాయిల ను బట్టి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద రూ.51 కోట్లు జమ చేసింది గత ప్రభుత్వం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారికి ఒక్క రూపాయి కూడా జమ చేయకపోవడంతో అన్నేసి వేల రూపాయలు ఎలా కట్టాలో తెలియక, కళాశాలల యాజమాన్యాల ఒత్తిడి తట్టుకోలేక ఎంతో మంది చదువును ఆపేయాలనే నిర్ణయానికి వచ్చినా ఎక్కడో చిన్న ఆశతో అప్పులు చేసి ఫీజులు చెల్లించారు.